క్లుప్తంగా

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బడిబాటలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి ప్రవేశం పొందిన 20 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ పూజారి ఉమాకాంత్ సరస్వతి చిత్రపటానికి పూజలు నిర్వహించి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంధ్య, రమేశ్, వికేశ్, శంకర్, మల్లేష్, వీరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఆవులను తరలిస్తే చర్యలు

ఇచ్చోడ: అక్రమంగా ఆవులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ హెచ్చరించారు. శనివారం ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా గోవధను నిషేధించినట్లు పేర్కొన్నారు. గోవులను వధించిన రవాణ చేసినా.. చర్యలు తప్పవన్నారు. ప్రతిఒక్కరూ సహకరించి బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఇచ్చోడ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఇచ్చోడ తహసీల్దార్ తుకారాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అడిగిన విత్తనాలనే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయించవద్దని సూచించారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ రామారావు, తదితరులు ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం: పెద్దపల్లిలో బాలికపై అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్‌సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మడావి రేణుక, వనిత, సురేశ్, బొచ్చిరాం, ఆకాశ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం: మరమ్మతులో భాగంగా భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు టౌన్ – 1 అసిస్టెంట్ ఇంజినీర్ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని భుక్తాపూర్, సినిమారోడ్డు, మోచిగల్లీ, రాణిసతీజి కాలనీ ఏరియాలకు గంట పాటు సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

తాంసి: మండలంలోని పొన్నారి మహాలక్ష్మి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కిరణ్ తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో హోమం, అర్చన పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అట్టహాసంగా ఫేర్‌వెల్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం అట్టహాసంగా ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సినీ, జానపద గీతాలపై చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ జలగం అనిత మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

బోథ్: ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన గోడం నగేశ్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన జగన్‌రెడ్డి, ఈదపు సాయిరెడ్డి, తదితరులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వెనుకబడిన బోథ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

బోథ్: బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, మేడిచెల్మ ప్రవీణ్, రఫీ, రమాకాంత్, లక్ష్మణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసమే జీవనోపాధి



విక్రయాల కోసం తీసుకువచ్చిన పశుగ్రాసం

- ఏళ్లుగా ఇదే ప్రధాన వృత్తి
- గ్రామాల నుంచి తీసుకొచ్చి విక్రయాలు

కైలాస్‌నగర్: మూగజీవాల ఆకలి తీర్చే పశుగ్రాసమే వారికి జీవనోపాధిగా మారింది. ఏళ్లుగా పశుగ్రాసాన్ని విక్రయిస్తూ.. ప్రధాన వృత్తిగా మార్చుకున్నారు. తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు పశుపోషకులకు అండగా నిలుస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణవాసులు చాలా మంది తమ ఇళ్ల వద్ద ఆవులు, గేదేలు, మేకలు వంటి మూగ జీవాలను పెంచి పోషిస్తున్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న చుట్టూ పక్కల గ్రామాల్లోని పచ్చదనంతో కళకళలాడాల్సిన పంట పొలాలు ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పుణ్యమాని ప్లాట్లు, వెంచర్లుగా మారుతున్నాయి. దీంతో పశుగ్రాసం లభించని పరిస్థితి నెలకొంది. పశువులను మేపేందుకు కాపరులు లేకపోవడం, పట్టణానికి గ్రామాలు దూరంగా ఉండడంతో పట్టణవాసులు వీరి వద్ద నుంచే పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల ప్రాంతం పశుగ్రాసం విక్రయాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఏళ్లుగా ఇక్కడే మూగ జీవాల మేత లభిస్తోంది.



పశుగ్రాసం

ప్రధాన వృత్తిగా రాణిస్తూ..

ఆదిలాబాద్ పట్టణంలోని పశు పోషకులకు పశుగ్రాసం దొరకని పరిస్థితి నెలకొంది. సమీపంలో పంట చేలు లేకపోవడంతో పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి, తాంసి మండలంలోని ఖోడద్, హస్నాపూర్ గ్రామాలకు చెందిన పలువురు వ్యవసాయ కూలీలు పశువుల మేతనే ప్రధాన వృత్తిగా ఎంచుకున్నారు. గత కొన్నేళ్లుగా జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల స్థలంలో మేతను విక్రయిస్తూ.. జీవనోపాధి పొందుతున్నారు. పచ్చగడ్డితో పాటు అటవీ ప్రాంతంలో పెరిగే మేకలకు అవసరమైన ఆరె తీగను, దుసరి తీగను తెంపుకు వచ్చి వాటిని కట్టలుగా కట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో కట్టను రూ.20 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలో సుమారు 20కిపైగా మటన్ విక్రయ కేంద్రాలున్నాయి. మాంసం విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. దీంతో మేకలకు అవసరమైన తీగ జాతి మేతను తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం వరకు పశుగ్రాసం విక్రయిస్తున్నారు. కొంత మంది పశుగ్రాసం కొరత ఉండే వేసవిలో విక్రయాలు సాగించగా.. మరికొంత మంది కాలమేదైనప్పటికీ పశువుల మేత విక్రయాలను సాగిస్తున్నారు.

మూడేళ్లుగా అమ్ముతున్నాను



గత మూడేళ్లుగా పశువుల మేత అమ్ముతున్నాను. ముఖ్యంగా మేకలకు అవసరమైన ఆరె తీగను విక్రయిస్తున్నాను. అటవీ ప్రాంతంలోని చెట్లపై, వాగుల వద్ద పెరిగే తీగలను తెంపి తీసుకువస్తాను. వాటిని కట్టలుగా కట్టి అమ్ముతున్నాను. చెట్లపై ఎక్కి తెంపడం కష్టమైనప్పటికీ ఇదే వృత్తిగా ఎంచుకున్నాను.

– అశోక్, హస్నాపూర్

వృత్తిగా ఎంచుకున్న



పశువుల మేతను అమ్మడమే ప్రధాన వృత్తిగా ఎంచుకున్నాను. గత 20 ఏళ్ల నుంచి పశుగ్రాసాన్ని విక్రయిస్తున్నాను. గ్రామాల్లోని చేలల్లో పెరిగిన గడ్డిని తీసుకువచ్చి అమ్ముతున్నాను. పట్టణంలోని పశు పోషకుల పశుగ్రాసానికి డిమాండ్ ఉండటంతో తమకు ఉపాధి లభిస్తోంది.

– గంగమ్మ, భీంసరి

ప్రశ్నార్థకంగా మానవ మనుగడ

ఆదిలాబాద్‌రూరల్: పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని జిల్లా ఎన్జీసీ కోఆర్డినేటర్, అంకోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంటి నర్సయ్య అన్నారు. భూతాపం పెరిగి గడిచిన వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఇలాంటి నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతుందన్నారు. గతంలోనే పర్యావరణ ఏకో క్లబ్బులు ఏర్పాటు చేయగా.. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల అంకోలిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి రోజు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం జరిగిందన్నారు. 15న ఆరోగ్యకరమైన జీవనశైలి, 18న వైజ్ఞానిక ఆహారపు అలవాట్లు, 19న వ్యర్థాలను తగ్గించడం, 20న చెత్తను తగ్గించడం, 21న ఇంధన శక్తిని ఆదా చేయడం, 22న నీటిని పొదుపు చేయడం, 24న ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న నర్సయ్య

పోడు భూములకు అనుమతులివ్వండి

ఇచ్చోడ: గత కొన్నేళ్లుగా సిరిచెల్మ అటవీ ప్రాంతంలో ముల్తానీలు సాగు చేస్తున్న పోడు భూములకు అనుమతులు ఇవ్వాలని అటవీశాఖ మంత్రి కొండ సురేఖను శనివారం బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కోరారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ముల్తానీల పోడు వ్యవసాయం సమస్యపై మాట్లాడారు. సిరిచెల్మ అటవీ ప్రాంతంలోని 174 కంపార్ట్‌మెంట్‌లో గత నలభై ఏళ్ల నుంచి ముల్తానీలు వ్యవసాయం చేసుకుంటూ.. జీవనోపాధి పొందుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈఏడాది అటవీశాఖ అధికారులు వ్యవసాయం చేసుకొనివ్వకుండా కందకాలు తవ్వుతున్నారని, చెట్లు నాటేందుకు సిద్ధం అవుతున్నట్లు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో టీపీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, సిరిచెల్మ ఉప సర్పంచ్ అజీం సుల్తాన్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దహిగూడ సమీపంలోని సంపు హౌజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులను దూరం చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టిందన్నారు. పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని దహిగూడ, తదితర గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. సంపులోకి నీరు చేరకపోవడంతో నీటి కొరత ఏర్పడిందన్నారు. ఆయన వెంట ఎంపీపీ గండ్రత్ రమేశ్, నాయకులు నారాయణ, కుమ్ర రాజు, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



నీటి సంపును పరిశీలిస్తున్న జోగు రామన్న

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

బోథ్: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని, పాఠ్య పుస్తకాలను, యూనిఫాంలు వెంటనే అందించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత విద్యా సంవత్సరంలో సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఉపాధ్యాయుల కొరత ఈవిద్యా సంవత్సరం లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు మున్సిఫ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

గుడిహత్నూర్: ప్రజలందరూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. బక్రీద్ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆవులను వధించకుండా చూడాల్సిన బాధ్యత ముస్లిం మత పెద్దలపై ఉందన్నారు. ఎవరైనా చట్టాలను అతిక్రమించి పశువులను వాహనాల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్సై సయ్యద్ ఇమ్రాన్, రాజేంద్రప్రసాద్, అర్షద్ ఖురేషి, ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

కై లాస్‌నగర్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రతో రాష్ట్ర ప్రజల మనసులు గెలిచారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ అన్నారు. భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, లోక ప్రవీణ్ రెడ్డి, శ్రీలేఖ, గంగారెడ్డి, బిక్కి గంగాధర్ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాద పూర్వంగా కలిశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డిలు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకాల విక్రయ దుకాణాలు తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పుస్తకాల దుకాణాలను జిల్లా విద్యాశాఖ పర్యవేక్షక అధికారి కందుల గజేందర్ శనివారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలను నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ఎవరికైనా అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. రోజు ఎన్ని పుస్తకాలు విక్రయించారనే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపీపీపై ఎస్పీకి ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్‌పై జెడ్పీఎస్ఎస్ యాపలగూడ ప్రధానోపాధ్యాయుడు ముజాఫర్ హుస్సేన్ శనివారం ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పాఠశాలలో అభివృద్ధి పనుల ప్రారంభానికి నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీతో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే హాజరైనట్లు పేర్కొన్నాడు. కార్యక్రమానికి ఎంపీపీని సైతం ఆహ్వానించినట్లు తెలిపాడు. ఇతర వ్యక్తుల విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీపీ శుక్రవారం సాయంత్రం ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించినట్లు పేర్కొన్నాడు. ఈ మేరకు కాల్ రికార్డును ఎస్పీకి అందించినట్లు హెచ్ఎం తెలిపాడు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని గలియబాయి తండా, ఏమాయికుంట గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేశారు. వర్షకాలంలో ప్రతిఒక్కరూ స్వచ్ఛతను పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, అరుణ, దివ్య, సుశీల, రమేశ్, జాదవ్ లక్కన్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

దశలవారీగా సమస్యల పరిష్కారం

- మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉదయం మండల కేంద్రంలోని గోండ్‌గూడ, మిలింద్‌నగర్, గజానంద్‌నగర్, బుద్ధనగర్, బజార్ గల్లి, ప్రబుద్ధనగర్, రాంనగర్, భీంనగర్, వడ్డెర గల్లి, పూలాజీబాబానగర్, కొబ్బాయ్‌గూడ గ్రామాల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. రానున్న రోజుల్లో పేదలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మెస్రం నాగ్‌నాథ్, ఎండీ మసుద్, ఎండీ జహిర్, జితేందర్ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

తెరుచుకోని పాఠశాలలు

- హాజరు కాని విద్యార్థులు
- కాలక్షేపం చేసి వెళ్తున్న ఉపాధ్యాయులు

ఇంద్రవెల్లి: ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు రోజులు అవుతున్నా.. ఇంకా పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో ఆశ్రమ వసతి గృహాలు వెలవెల బోతున్నాయి. ఈనెల 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలను ఆశ్రమ పాఠశాలలకు తీసుకురావాల్సిన ఉపాధ్యాయులు ప్రతీరోజు పాఠశాలలకు వచ్చి విద్యార్థులు లేక కాలయాపన చేసి వెళ్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం ఉదయం మండలంలోని పిట్టబొంగరం ఆశ్రమ వసతి గృహంలో పిల్లలు లేక తాళం వేసి దర్శనమిచ్చింది. స్థానికులకు అడిగితే ఇంకా విద్యార్థులు రాలేదని సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి వసతి గృహాలకు విద్యార్థులు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



తాళం వేసి ఉన్న పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాల

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

నేరడిగొండ: సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని సవర్గాం ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు తుకారాం అన్నారు. శనివారం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు.



యూనిఫాం అందజేస్తున్న ఉపాధ్యాయులు

అటవీ అధికారుల వేధింపులు ఆపాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కై లాస్‌నగర్: ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం, గుండాల గ్రామాల్లోని గిరిజనేతర రైతులపై అటవీశాఖ అధికారులు వేధింపులను తక్షణమే ఆపాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయా గ్రామాల రైతులతో కలిసి పోడు భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యను వివరిస్తూ.. న్యాయం చేయాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తు దీనిపై విచారణ జరిపిస్తామని భరోసానిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనేతర రైతులను అటవీ అధికారులు ట్రెంచ్‌లు కొడుతూ, మొక్కలు నాటుతామంటూ వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. గిరిజనేతర పోడు సమస్యను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రయత్నించిందన్నారు. ఇప్పటి ప్రభుత్వ పరిశీలనలో కూడా ఉందన్నారు. సమస్యను పరిష్కరించకుండా వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రస్తుతం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ ప్రీతంరెడ్డి, తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

'లంబాడాలపై పెరిగిన అత్యాచారాలు'

నేరడిగొండ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గిరిజన లంబాడాలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నార్నూర్‌తో పాటు హైదరాబాద్‌లోని మియాపూర్‌లో, ఇలా చెప్పుకుంటూ పోతే రోజురోజుకూ గిరిజన లంబాడాలపై హత్యలు పెరిగిపోతున్నాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. లేనిపక్షంలో లంబాడాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో లంబాడాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్ జాదవ్

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

నేరడిగొండ: గోవధ నిషేధ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని మండల విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ వాహిని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గోవధ నిషేధ చట్టం రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని, వాటిని తక్షణమే అమలు చేయాలని, అక్రమ గో రవాణాను అడ్డుకునేందుకు శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగాల సంతోష్ గౌడ్, సోలంకి సాయి, సాబ్లే సంతోష్ సింగ్, మహేందర్, సురేందర్, రవినాయక్, శేఖర్, ధన్ను, లచ్చిరాం పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

పరామర్శ

నార్నూర్: ఇటీవల దారుణ హత్యకు గురైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురా లు ఆత్రం సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావులు శనివారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలోని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. సీఐకి ఫోన్ చేసి కారణాలను అడిగి తెలుసుకున్నారు. హత్య చేసిన వారిపై కేసులు నమో దు చేసి, కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని సూచించారు.